మెట్రోరైలులో ప్రయాణించిన మంత్రి శ్రీధర్‌బాబు


మెట్రో రైలులో ప్రయాణిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు శనివారం మెట్రోరైలులో ప్రయాణించారు. ఎల్బీనగర్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మెట్రో రైలులో హైటెక్ సిటీకి వెళ్లారు. నగరంలో వర్షాల కారణంగా రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండటంతో హైటెక్‌సిటీలో మరో కార్యక్రమంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఆ కార్యక్రమానికి ఆలస్యమవుతుందని ఎల్బీనగర్ నుంచి నేరుగా ఉప్పల్ మెట్రోస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హైటెక్ సిటీ వరకు మెట్రోరైలులో ఆయన ప్రయాణించారు. మంత్రి వెంట రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కూడా ఉన్నారు. ట్రాఫిక్ సమస్యలకు మెట్రోరైలు సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా మంత్రి పేర్కొన్నారు. నగరాభివృద్ధికి మెట్రోరైలు విస్తరణ మరింత అవసరమని ప్రభుత్వం ఆ దిశగా కట్టుబడి ఉందన్నారు.

యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణానికి సత్వర చర్యలు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖాద్రీకాలనీలో యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని ఖాద్రీకాలనీలో మాజీ కార్పొరేటర్ పద్మానాయక్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అవసరం ఉన్న చోట్ల యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, నాయకులు నాగిరెడ్డి, భిక్షపతిచారి, శ్రీనివాస్‌నాయక్, కాలనీ అధ్యక్షుడు జమీర్‌బాయ్, కాలనీ ప్రతినిధులు ఎండీ ఖాద్రీ, సయ్యద్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.


ఖిల్లా మైసమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను దర్శించుకున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, కరుణాకర్


చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్‌నగర్, రామలింగేశ్వర నగర్ కాలనీల్లో అమ్మవారి మండపాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు


నాదర్‌గుల్‌లోని శ్రీరామ ఎన్‌క్లేవ్ ఫేజ్-4లో దుర్గా మాత మండపం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న శ్యాంసుందర్‌శర్మ పంతులు, ఉత్సవ నిర్వాహకులు


హయత్‌నగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్‌కాలనీ ఫేజ్-2లో మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు

కుంకుమార్చనతో కొలిచి.. తనివి తీరా తలచి..

స్వర్ణ శోభితం నవరాత్రి వైభవం

సైదాబాద్/వనస్థలిపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వివిధ ప్రాంతాల్లో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు, మండపాలు భక్తుల రాక పోటెత్తుతున్నాయి. శనివారం సైదాబాద్ మాతమైదాన్‌లోని విజయదుర్గమాత మహాలక్ష్మి దేవి అలంకరణలో, జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి లలితా త్రిపురసుందరి దేవి అలంకారాలతో దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని హరిహరపురం కాలనీలోని ప్రసిద్ధ త్రిశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తుల సమక్షంలో కనుల పండువగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ఆలయంలోని మహాదుర్గాదేవి లలితా దేవిగా, మహా సరస్వతిదేవి అన్నపూర్ణదేవిగా, మహాలక్ష్మీదేవి ధాన్యలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సంకల్పకర్త, చైర్మన్ డి.విజయభాస్కర్, మేనేజింగ్ ట్రస్టీ ఎన్.నారాయణరెడ్డి, కోశాధికారి కె.రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హరిహరక్షేత్ర అయ్యస్వామి ఆలయంలో లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో ఉన్న దుర్గామాతకు పూజలు చేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి


స్నేహపురి పద్మావతీగోదా సమేత వేంకటేశ్వర ఆలయంలో ధనలక్ష్మి అవతారంలో కరెన్సీ నోట్ల మాలతో పద్మావతి అమ్మవారు


మహాలక్ష్మీదేవి అలంకరణలో మాతామైదాన్‌లోని విజయదుర్గామాత

రేపు కేర్ ఆస్పత్రిలో గుండె పరీక్షలు ఉచితం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న మలక్‌పేటలోని కేర్ ఆస్పత్రిలో గుండె ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. గుండె వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను మలక్‌పేట కేర్ ఆస్పత్రిలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మలక్‌పేటలోని కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. ఉచిత గుండె ఆరోగ్య పరీక్ష ప్యాకేజీలో ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ పరీక్షలతో పాటు కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ కూడా ఉచితంగా అందిస్తామని తెలిపారు. అదనంగా యాంజియోగ్రామ్ అవసరమని డాక్టర్ సూచించిన వారికి తగ్గింపు ధరలో ఈ పరీక్ష అందుబాటులో ఉంటుందని తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో గుండె సమస్యలకు సంబంధించిన సంకేతాలు కనిపిస్తున్నవారు కూడా పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.


అవంతి క్యాంపస్‌లో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు


బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి


తుర్కయంజాల్ మున్సిపాలిటీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు, యాజమాన్య కమిటీ ప్రతినిధులు, సిబ్బంది

ఘనంగా బతుకమ్మ సంబురాలు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ క్యాంపస్‌లో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద బతుకమ్మ ఆట, పాటలతో అధ్యాపకులు, విద్యార్థినులు అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. శేషతల్పసాయి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ఏఓ పిచ్చిరెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్వో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో..

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌ఆర్‌నగర్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి హాజరైనారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ ఉషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వినయ్, బాల్‌రాజ్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీరు సురేష్ పాల్గొన్నారు.

రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో..

వనస్థలిపురం : రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో వనస్థలిపురం డివిజన్ హస్తినాపురంలో జీవీఆర్ కన్వెన్షన్‌లో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాచకొండ సీపీ సుధీర్‌బాబు హాజరయ్యారు. పెద్దఎత్తున మహిళా పోలీస్ సిబ్బంది రూపొందించిన బతుకమ్మలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సిబ్బంది బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో డీసీపీలు ప్రవీణ్‌కుమార్, అరవింద్‌బాబు, సునీతారెడ్డి, రమణారెడ్డి, ఇందిర, ఉషారాణి, నాగలక్ష్మి, మనోహర్, శ్రీనివాసులు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పురాతన శివలింగం విక్రయానికి యత్నం

- 2023లో బైరంవాని చెరువు శివాలయంలో అపహరణ
- ఎల్బీనగర్‌లో నలుగురు సభ్యుల ముఠా అరెస్టు
- శివలింగం, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

కొత్తపేట : ఎల్బీనగర్‌లో నలుగురు నిందితుల ముఠాను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి పురాతన శివలింగం, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పురాతన శివలింగాన్ని రూ.2 కోట్లకు విక్రయించడానికి ఓ ముఠా యత్నిస్తోందని విశ్వసనీయ సమాచారం అందింది. ఎల్బీనగర్‌లోని ఓ ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఉన్న పురాతన శివలింగాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించారు. ప్రధాన నిందితుడు ధీరావత్ నరేందర్(42)దామరచెర్ల కల్లెపల్లి బంగారుమైసమ్మగుడిలో పూజారి. మందకోట ఇమాన్యుయల్(30) రాజేంద్రనగర్‌లో ఉండే భూగర్భజలాల/బోర్‌వెల్ సర్వేయర్. మేడ్చల్ మౌలాలి బోడెబండకు చెందిన పబ్బోజు బ్రహ్మాచారి(48)కార్పెంటర్. మిర్యాలగూడలో ఉంటున్న తుంగతుర్తికి చెందిన పోలేపల్లి సుధాకర్ ఆర్టీసీ డ్రైవర్. ఇమాన్యుయల్ తరచూ నరేందర్ పూజారిగా ఉండే బంగారు మైసమ్మ గుడికి వెళ్లేవాడు. అతడికి నరేందర్ స్నేహితుడయ్యాడు. పోలేపల్లి సుధాకర్ నరేందర్‌కు చిన్ననాటి మిత్రుడు. వారికి పబ్బోజు బ్రహ్మాచారి కూడా స్నేహితుడే. నలుగురూ ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కడానికి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. 2023లో బైరంవానిచెరువు వద్ద పాడుబడిన శివాలయంలో ఓ శివలింగం ఉందని నరేందర్ గుర్తించాడు. విషయాన్ని అతడు ఇమాన్యుయల్‌తో చర్చించాడు. ఓ అర్ధరాత్రి పాడుబడిన ఆలయంలో ఉన్న శివలింగాన్ని పెకిలించేసి బాచుపల్లిలోని ఓ ఇంట్లో దాచారు. లింగాన్ని విక్రయించే బాధ్యతను బ్రహ్మాచారికి అప్పగించారు. శివలింగం సమాచారం అందడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. శివలింగాన్ని, 4సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్

ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. శనివారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ కార్మికులకు, చాట కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికుల సంక్షేమం కోసం కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నాడని త్వరలోనే అన్ని రంగాల్లో పని చేసే కార్మికుల వృత్తిపరమైన సమస్యలు నెరవేరబోతున్నాయన్నారు. మార్కెటింగ్ శాఖలో పనిచేసే కార్మికులకు ఏకరూప దుస్తులు, గుర్తింపు కార్డులతో పాటు వారికి డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇచ్చే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు ఆమె తెలిపారు. మార్కెట్‌లో పనిచేసే కార్మికులు వారి సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానని అన్నారు. మార్కెట్ అధికారులు, సిబ్బంది రైతులకు పంట అమ్ముకోవడంలో ఇబ్బందులు లేకుండా సహకరించి మార్కెట్‌ను అగ్రభాగంలో నిలపాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. అనంతరం కార్మికులు మార్కెట్ చైర్‌పర్సన్‌ను, పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మహ్మద్ షకీల్, మస్రత్ సుల్తానా, రామారావు, సత్యనానాయణ, ప్రత్యూష, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా


ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

వనస్థలిపురం : వనస్థలిపురం కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీమెటీరియల్, వన్‌గ్రామ్‌గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్‌బెడ్‌షీట్స్, కొండపల్లిటాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


బాపూజీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న చేనేత సహకార సంఘం అధ్యక్షుడు తిరుమలేష


ఆర్‌కేపురంలో బాపూజీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్, చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధు, తలాటి రమేష్


పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ అమరేందర్‌రెడ్డి, అధికారులు

‘కొండంత’ అభిమానంతో ‘కొండా’కు నివాళి


బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎంపీ ఈటల


బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ సరస్వతి, ఏఎంసీ జాన్‌కృపాకర్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర సిబ్బంది

వనస్థలిపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని భావనఋషి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు తిరుమలేష అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అనంతవేణి నగర్‌లోని సంఘం కార్యాలయంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు భావనఋషి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తిరుమలేష లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వనం శ్రీరంగం, ప్రధాన కార్యదర్శి తిరందాసు నర్సింహ, కోశాధికారి జి.ప్రభాకర్, సూర్యకళ, జనార్దన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.